31వ వసంతంలోకి
# చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా
బుధవారం 22 జులై 2026
పేజీలు : 8

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

◆రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి
◆రోడ్డు భద్రత అంశాన్ని సుప్రీంకోర్టు అత్యంత నిశితంగా పర్యవేక్షిస్తోంది
రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్




చురకలు ప్రతినిధి,జగిత్యాల, జూలై21 : జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సమర్థవంతమైన 2లో

## సర్ ప్రక్రియ సకాలంలో పూర్తిచేయాలి

◆రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిపెట్టాలి
◆అధికారం ఉన్నప్పుడు కేటీఆర్‌కు రైతుల సమస్యలు కనపడలేదు
◆రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



చురకలు, విలేఖరి, వెల్గటూర్, జులై 21 : భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న"సర్" కార్య క్రమంలో ప్రతి ఒక్కరూ భాగ స్వాములై సర్వే ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. మంగళవారంధర్మపురి నియోజక వర్గం ఎండపెల్లి మండలం ముంజంపల్లి, మారేడువెల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి పాల్గొన్నారు. ఓటరు నమోదు వివరాల పై ప్రజలకు అవగాహన కల్పించి వేగవంతంగా సర్ ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. మారేడుపల్లి ప్రభుత్వ పాఠశాలలో రూ.5 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కిచెన్ షెడ్డును మంత్రి ప్రారంభించారు. అదేవిధంగా విద్యార్థులతో కలిసి మొక్కను నాటారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రతి పౌరుడికి కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అందువల్ల ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని కోరారు.రాష్ట్రంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు.సర్ ప్రక్రియ తీరుపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలసాగుపై దృష్టిపెట్టాలని సూచించారు.నంది మేడారం రైతువేదికలో జిల్లావ్యవసాయకా అధికారులు నిర్వహించిన రైతు అవగాహన సదస్సు లో ఆయన పాల్గొన్నారు. సాదారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాపాతం నమోదయ్యే పరిస్థితి నెలకొనడంతో సాగునీటికొరత ఏర్పడే ప్రమాదం ఉండడంతో రైతులు నష్టపోకుండా వరి పంటలకు బదులు పత్తి,కంది,పెసర లాంటి ఇతర ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసుకునేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గతం లో అధికారంలో ఉన్నప్పుడు కెటిఆర్ కు రైతుల సమస్యలు కనబడలేదని, బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుల గురించి ఏనాడు పట్టించుకోలేదని,అధికారం దూరం కాగానే కేటీఆర్ రైతుల పరామర్శ పేరిట డ్రామాలాడుతున్నారని మంత్రిఅడ్లూరిఆరోపించారు. కొండగట్టు వద్ద బస్సు 2లో

## జగిత్యాలలో సర్ ప్రక్రియను 100శాతం విజయవంతం చేయాలి



◆జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

చురకలు ప్రతినిధి,జగిత్యాల,జూలై 21 : జగిత్యాలలో సర్ ప్రక్రియను 100 శాతం విజయవంతం చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు.మంగళవారం జగిత్యాల పట్టణ 7,8,9వార్డులలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రోగ్రామ్ సరళిని అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్,మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు ఉండేలా శ్రద్ధ వహించాలని కోరారు.ప్రజా ప్రతినిధులు ,నాయకులు, అధికారులు వార్డులో సర్ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబం సర్వేలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, లోకల్, నాన్-లోకల్ ఓటర్లను త్వరగా గుర్తించాలన్నారు. నిర్దేశిత గడువు ముందే పూర్తి చేయడానికి బిఎల్ఎ, బిఎల్ఓలు కార్యాచరణ చేపట్టాలని, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో బిఎల్ఓలు సర్ ప్రక్రియ పూర్తి చేసే విధంగా కృషి చేయాలని ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా అందరూ సర్ 2లో

### అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో
## వేడుకగా బోనాల పండుగ






చురకలు విలేఖరి,కరీంనగర్, జులై, 21 : బోనాలు తెలంగాణ రాష్ట్రానికి ప్రతీకాని మరియు రాష్ట్ర పండుగగా పరిగణించడం జరిగిందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో వేడుకగా ఏర్పాటు చేసినటువంటి బోనాల ఉత్సవాలను అట్టహాసంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బోనాల పండుగను చాలా సంతోషంతో తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించడం జరుగుతుందని మరియు కుటుంబ సభ్యులతో మమేకమై వేడుకను నిర్వహించుకుంటారని వారు చెప్పారు.విద్యా సంస్థల్లో ప్రతి సంవత్సరం లాగే ఈ 2లో

## ప్రజల గుండెల్లో జర్నలిస్టులకు సుస్థిర స్థానం

◆మునీర్ జీవితం ఆచరణీయం
◆ప్రధాని తీరు ప్రజాస్వామ్యానికి నష్టదాయకం
◆నాలుగు లేబర్ కోడ్స్ జర్నలిస్టులకు నష్టదాయకమైనవి
◆ప్రధాన పత్రికల వైఫల్యమే సోషల్ మీడియా విజృంభన
◆మునీర్ బాభాయ్ పుస్తక పరిచయ సభలో కే. శ్రీనివాసరెడ్డి, చైర్మన్ రాష్ట్ర మీడియా అకాడమీ



చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (జబ్బార్ ఖాన్)జూలై 21 : ప్రజల పక్షాన నిలిచి,నిష్పక్షపాతంగా పనిచేసినప్పుడే జర్నలిస్టులకు ప్రజల గుండెల్లో స్థానం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.ప్రెస్ క్లబ్-గోదావరిఖని సౌజన్యంతో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో మంగళవారం జరిగిన ప్రోలిటేరియన్ జర్నలిస్ట్ మునీర్ బాయ్ పుస్తక పరిచయసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతదేశంలో పెట్టుబడిదారుల చేతుల్లోకి మీడియారంగం వెళ్లిపోయిందని అన్నారు. గడిచిన 12 సంవత్సరాలలో ప్రధానమంత్రి కనీసం ఒక్క మీడియా సమావేశం కూడా ఏర్పాటు చేయలేదని ఇది ప్రజాస్వామ్యానికి, ప్రజలకు నష్టదాయకమని 2లో

## వయోవృద్ధుల రక్షణకు డీజీపీకి టాస్క వినతి

**చురకలు విలేకరి, జగిత్యాల, జులై 21 :** వర్తమాన కాల పరిస్థితుల్లో వయో వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రములో నివసిస్తున్న వయో వృద్ధుల రక్షణ కు పటిష్ట వ్యూహం అమలు చేయాలని కోరుతూ తమ రాష్ట్ర అధ్యక్షులు పి. నర్సింహారావు ఆధ్వర్యంలో డీజీపి సీవీ.ఆనంద్‌కు హైదరాబాద్ లో వినతి పత్రం సమర్పించామని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు,సీనియర్ న్యాయవాది హరి అశోక్‌కుమార్ తెలిపారు. తల్లి దండ్రులు, వయో వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టంలోని సెక్షన్ 21(2)(5) ప్రకారం ప్రతి పోలీస్ స్టేషన్ పరిధి లో నివసించే వృద్ధుల ఇళ్లను తరుచుగా సందర్శించాలని,వయోధికుల నుండి ఫిర్యాదులు అందిన వెంటనే సంబందించిన పోలీస్ అధికారులు తక్షణమే స్పందించేలా తగు ఆదేశాలు జారీ చేయాలని కోరామన్నారు.రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సి.హన్మంత్ రెడ్డి,జిల్లా కార్యదర్శి గౌరి శెట్టి విశ్వ నాథము, సహాయ అధ్యక్షులు బొల్లం విజయ్, టాస్క బృందంలో ఉన్నారు.

## సర్ ప్రక్రియ సకాలంలో పూర్తిచేయాలి

**మొదటి పేజీ తరువాయి...** ప్రమాదంలో మరణించిన కుటుంబాలను నాటి ముఖ్యమంత్రి ఎందుకు పరామర్శించ లేదని ప్రశ్నించారు.వర్షాభావ పరిస్థితితో రైతులు ఇబ్బంది పడు తుంటే అండగా ఉండి మనో ధైర్యం కల్పించాల్సిందిపోయి బాధ్యత మరిచి ప్రతిపక్ష నాయకులు వ్యవహరించడం శోచనీయమన్నారు ఎండపల్లి, ధర్మారం మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి అడ్లూరి పాల్గొని మాట్లాడారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో వేడుకగా బోనాల పండుగ

**మొదటి పేజీ తరువాయి...**సంవత్సరం కూడా బోనాల ఉత్సవాలను చాలా గొప్పగా నిర్వహించుకోవడం జరిగినదని వారు చెప్పారు. ప్రతి ఒక్కరూ సంస్కృతి సాంప్రదాయాలను పాటించాలని మరియు అమ్మవారిని వివిధ రూపంలో కొలవాలని వారు చెప్పారు.బోనం అంటే భోజనం అని ఆ భోజనాన్ని మనం అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తామని అనంతరం అందరికీ పంపిణీ చేస్తామని వారు గుర్తు చేశారు. చాలా గొప్ప ఆచారమైనటువంటి బోనం సమర్పణ ద్వారా సుఖసంతోషాలతో సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొంటుందని గుర్తు చేశారు.వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపచేసాయి. ప్రధానంగా విద్యార్థులు నరేందర్ రెడ్డి గారికి మూథం అందజేసి ప్రత్యేక నృత్యం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన



**చురకలు విలేకరి, బీర్ పూర్, జులై 21 :** బీర్ పూర్ మండలంలో వ్యవసాయ అధికారులు ఆధ్వర్యంలో ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల గురించి గ్రామాలలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏవో తిరుపతి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు అనుకున్న స్థాయిలో పడే అవకాశం లేదని, కాబట్టి రైతులు తమకున్న భూమిలో పూర్తిగా వరి నాట్లు వేయకుండా, వర్షంతో సంబంధం లేకుండా తమ యొక్క బావులలో నీరు ఎంతవరకు సరిపోతుందో అంతవరకే నాట్లు వేసుకోవాలని సూచించారు. మిగిలిన భూమిలో ఆరుతడి పంటలైన కందులు, పేసర్లు, మినుములు, సజ్జలు, జొన్నలు, అనుములు, చిరు ధాన్యాలు, కూరగాయలు సాగు చేసుకోవాలని తెలిపారు. వరికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తున్న ఆయిల్ పామ్ సాగు చేసుకోవాలని సూచించారు. పెరుగుతున్న ఎరువుల ధరలను దృష్టిలో ఉంచుకొని రైతులు జీవ ఎరువులు ఇ, రైజోబియం, ట్రైకో డెర్మా ఇతర జీవన ఎరువులు వాడాలని సూచించారు. నీటిని అదా చేసుకోవడానికి రైతులు ఇంకుడు గుంతలు, రీచార్జ్ పిట్ లు తవ్వుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఏఈవోలు అయ్యోరీ వినోద్, వడ్లూరి శిరీష, గ్రామల సర్పంచులు, ఏఎంసి డైరెక్టర్ జోగిరెడ్డి, గ్రామల ఉపసర్పంచులు, వర్డ్ సభ్యులు, అన్ని గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో సర్ ప్రక్రియను 100శాతం విజయవంతం చేయాలి

**మొదటి పేజీ తరువాయి...** ప్రక్రియలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. 7, 8, 9 వార్డులలో 60 శాతం కంటే తక్కువ సర్ ప్రక్రియ జరిగిందని, అధికారులు వార్డుకు వచ్చినప్పుడు ఫారం అందజేసి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గడువు ఇంకా ఉందని నిర్లక్ష్యం చేయవద్దని, ప్రతి పౌరుడు విధిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాల్సి ఉందని, ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఒక




ఆయుధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు గాజెంగి నందయ్య, కమిషనర్ సత్య ప్రణవ్, తహసీల్దార్ రామ్మోహన్, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, మైనార్టీ నాయకులు చాంద్ పాషా, కౌన్సిలర్లు తిరుమలయ్య, కోరుకంటి రాము, హరీష్, పిట్ట ధర్మరాజు, కూతురు రాజేష్, చీటి లక్ష్మీనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమల రాజ్ కుమార్, సేవాదళ్ సెక్రటరీ ముకేష్ ఖన్నా, నాయకులు శ్రీనివాస్, రమేష్, కైరీ అజయ్ గౌడ్, పంబాల రాము, తొలిప్రేమ శ్రీనివాస్, శ్రీధర్ రావు, సంతోష్ రావు, ప్రవీణ్ రావు, అక్షయ్, కృష్ణ రావు, గంగాధర్, మున్సిపల్, రెవెన్యూ అధికారులు, బిఎల్ఓలు, బిఎల్ఎలు, వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో జర్నలిస్టులకు సుస్థిర స్థానం

**మొదటి పేజీ తరువాయి...** పేర్కొన్నారు.జర్నలిజాన్ని నమ్ముకుని జీవితాంతం అన్యాయాన్ని, ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ,పాలకుల లోపాలను ఎత్తిచూపుతూ ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న జర్నలిస్ట్ మునీర్ జీవితం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. నిర్భయంగా,ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా,వాస్తవ సమాచారాన్ని ప్రజలకు అందించడమే జర్నలిస్టుల కర్తవ్యం అని ఆయన ఉద్బోధించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్‌కోడ్స్ వలన సమాజంలో నాలుగవ స్తంభంగా నిలబడిన జర్నలిస్టులను, దుకాణాలలో పనిచేసే కూలీలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తపరిచారు. జర్నలిస్టుల జీతభత్యాల పెరుగుదలకు మరో సమరశీల పోరాటం నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అప్రజాస్వామికంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ప్రధాన పత్రికా రంగంలో వృత్తి నిబద్ధత కోల్పోవడం వలన సోషల్ మీడియాకు ఆదరణ పెరిగిందని తేల్చి చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే కొన్ని



కథనాలు వాస్తవానికి దూరంగా ఉంటున్నాయని, వాటిపై ఏలాంటి తనిఖీ, నియంత్రణ లేకపోవడం వల్ల విచ్చలవిడితనం పెరిగిపోతున్నదని దీనిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

**ఆదర్శప్రాయుడు మునీర్**

అక్షరాలను నమ్ముకుని జీవితాంతం పనిచేసిన మునీర్‌జీవితం ఆచరణీయమని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ కొనియాడారు. ముఖ్య మంత్రిలతో సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ సామాన్యమైన జీవితాన్ని గడుపుతూ, ప్రజల కోసమే మునీర్ పనిచేశాడని ఆయన పేర్కొన్నాడు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని జర్నలిస్టులకు ఇంటిస్థలాలు, ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని ఆయన పేర్కొన్నారు. కోల్ బెల్ట్ జర్నలిస్టులు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారని అన్నారు. మునీర్ జీవితంపై పరిశోధన చేయాలని సూచించారు.అక్షర ఫౌండేషన్ అధ్యక్షుడు మాదాసి రామమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య ఐజేయు టీయూడబ్ల్యూజే జాతీయ నాయకుడు నగునూరి శేఖర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్ కుమార్ జిల్లా అధ్యక్షుడు మల్లా వజుల వంశీ, గోదావరిఖని ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డి మాధవరావు గడ్డం శ్యామ్ కుమార్, ఇఫ్టా జాతీయ నాయకులు కే స్వామి కార్మిక సంఘాల నాయకులు తుమ్మల రాజిరెడ్డి రియాజ్ అహ్మద్ పర్లపల్లి రవి ఐ కృష్ణ మల్లికార్జున్ శ్రోతులు కె విశ్వనాథ్ తోకల రమేష్ రచయిత నక్క వెంకట్రావు, పుస్తక సమీక్షను హెచ్ రవీందర్ నిర్వహించారు. అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు గాండ్ల శ్రీనివాస్, బక్క రవి, శేఖర్,కోల లక్ష్మణ్,పాలకుర్తి విజయ కుమార్,జబ్బార్‌ఖాన్,మామిడి సత్యనారాయణ, మనోహర్ రెడ్డి, సుధాకర్ రావు, జేవి రాజు,శ్రీపతి రాజగోపాల్,మైనార్టీ నాయకులు హమీద్,మాల మహానాడు నాయకులు మర్రి ఐలయ్య,పిట్టల వెంకటి,నంది నరేష్,ప్రజానాట్యమండలి కళాకారులు కన్నం లక్ష్మీనారాయణ, చీకటి అంజయ్య, ఎజ్జ రాజయ్య, దయా నర్సింగ్ జనగామ రాయనర్స్ పద్మ రమ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**మొదటి పేజీ తరువాయి...** రోడ్డు భద్రత చర్యలు అమలు చేయాలని రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జిల్లా అధికారులను ఆదేశించారు.మంగళవారం హైదరాబాద్ నుంచి జాతీయ రహదారులపై రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ మాట్లాడుతూ, రోడ్డు భద్రతను పెంపొందించడం, రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సంబంధించి సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను అన్ని రాష్ట్రాలు కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు బీహార్, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాలు మాత్రమే సుప్రీంకోర్టుకు అనుసరణ నివేదికలు సమర్పించాయని, మిగిలిన రాష్ట్రాలు కూడా త్వరితగతిన చర్యలు తీసుకొని నివేదికలు పంపాలని సూచించారు. జాతీయ రహదారులపై అనధికారిక పార్కింగ్‌ను పూర్తిగా నివారించాలని, పెట్రోలింగ్ వాహనాల నిర్వహణను బలోపేతం చేయడంతో పాటు భారీ వాహనాల కోసం అవసరమైన పార్కింగ్ స్థలాలను జాతీయ రహదారుల సమీపంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారుల అధికారులు, పోలీసు శాఖ, సంబంధిత శాఖల అధికారులతో వెంటనే సమన్వయ సమావేశాలు నిర్వహించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జాతీయ రహదారులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి నిబంధనల ప్రకారం వెంటనే తొలగించాలని, ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతీయ రహదారుల వెంట ఉన్న ఆసుపత్రులను మ్యాపింగ్ చేసి అత్యవసర వైద్య సేవలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారుల పక్కన కొత్తగా మద్యం దుకాణాలకు ఎలాంటి లైసెన్సులు మంజూరు చేయరాదని స్పష్టం చేశారు. జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న రహదారుల్లో ప్రమాదాలను తగ్గించేందుకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి పనులను ప్రాధాన్యంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రతి జిల్లా రోడ్డు భద్రతకు సంబంధించి చేపట్టిన చర్యలపై సమగ్ర కార్యాచరణ నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రోడ్డు భద్రత అంశాన్ని సుప్రీంకోర్టు అత్యంత నిశితంగా పర్యవేక్షిస్తోందని, ఈ ప్రక్రియలో అవసరమైన అన్ని శాఖల సమన్వయం, పోలీసు సహకారం అందేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అన్ని అనుసరణ నివేదికలను వీలైనంత త్వరగా సమర్పించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రవాణా శాఖ అధికారి సంధాని, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో అంతర్‌జిల్లా దృష్టి మళ్లింపు దొంగల ముఠా అరెస్ట్

**-బంగారు గొలుసు, మొబైల్ ఫోన్లు స్వాధీనం**



**చురకలు ప్రతినిధి కోరుట్ల, జూలై 21 :** కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో అమాయక ప్రజలను, ముఖ్యంగా వృద్ధులను లక్ష్యంగా చేసుకుని దృష్టి మళ్లించి బంగారు ఆభరణాలు అపహరిస్తున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను కోరుట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి సుమారు 24 గ్రాముల బరువున్న లక్ష్మీదేవి బిళ్లల బంగారు గొలుసుతో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితులు అల్లెపు కృష్ణ (51), కుంచెపు శ్రీకాంత్ (30), అల్లెపు రాజ్‌కుమార్ (28)లు సిద్దిపేట జిల్లా ప్రశాంత్‌నగర్, వడ్డెర కాలనీ ప్రాంతాలకు చెందినవారు. పోలీసుల విచారణలో నిందితులు సిద్దిపేట ప్రాంతంలో గుర్తుపడే అవకాశం ఉండటంతో ఇతర ప్రాంతాల్లో వరుస దొంగతనాలు చేయాలనే ఉద్దేశంతో కోరుట్లకు వచ్చినట్లు వెల్లడైంది. ఈ నెల 15వ తేదీన కోరుట్లకు చేరుకుని స్థానిక లాడ్జిలో బస చేసిన వారు, 16వ తేదీన బస్టాండ్ పరిసరాల్లో వృద్ధులను లక్ష్యంగా చేసుకుని నేరానికి పాల్పడ్డారు. కోరుట్ల బస్టాండ్ వద్ద సుమారు 70ఏళ్ల వృద్ధురాలిని పరిచయం చేసుకుని, ఆమె పెన్షన్‌ను రూ. 2,000నుంచి రూ. 4,000కు పెంచిస్తామని నమ్మబలికారు. అనంతరం ఎస్‌బీఐ బ్యాంకు సమీపానికి తీసుకెళ్లి, బంగారు ఆభరణాలు ధరించి ఉంటే పెన్షన్ రాదని మాయమాటలు చెప్పి ఆమె మెడలో ఉన్న లక్ష్మీదేవి బిళ్లల బంగారు గొలుసును తీసుకున్నారు. పెన్షన్ ఫారాలు తీసుకొస్తామని చెప్పి అక్కడి నుంచి పరారయ్యారు. మరిన్ని దొంగతనాలకు పాల్పడేందుకు లాడ్జిలోనే ఉన్న నిందితులను కోరుట్ల పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 24 గ్రాముల బంగారు గొలుసు, ఒక రియల్‌మీ మొబైల్ ఫోన్, ఒక శాంసంగ్ మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ప్రధాన నిందితుడు అల్లెపు కృష్ణపై గతంలో వివిధ పోలీస్ స్టేషన్లలో 100కు పైగా కేసులు నమోదైనట్లు, మిగిలిన ఇద్దరు నిందితులపై కూడా పలు దొంగతనాల కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న వస్తువులకు చట్టపరమైన పంచనామా నిర్వహించిన అనంతరం నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపర్చేందుకు తదుపరి చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

**ప్రజలకు సూచనలు:** ప్రభుత్వ పథకాలు, పెన్షన్ పెంపు, బ్యాంకు పనుల పేరుతో అపరిచితులు సంప్రదిస్తే అప్రమత్తంగా ఉండాలని, విలువైన బంగారు ఆభరణాలను ఎవరికీ అప్పగించవద్దని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు సమాచారం అందించాలని కోరారు.

# సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా

**-సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు చేస్తే కఠిన చర్యలు**

**-పోస్ట్ చేసిన వ్యక్తితో పాటు, గ్రూప్ అడ్మిన్ పైనా కేసులు నమోదు చేస్తాం**

**- ఇబ్రహింపట్నం ఎస్ఐ నవీన్ కుమార్**




**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జులై (21) :** సోషల్ మీడియా వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు, వ్యాఖ్యలు, వీడియోలు, సందేశాలు ప్రసారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం పోలీస్ స్టేషన్ ఎస్ఐ నవీన్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం ఇబ్రహింపట్నం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, టెలిగ్రామ్ తదితర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారాలు, అసత్య సమాచారం, మత, కుల విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు పెరుగుతున్నాయని, ఇలాంటి కార్యకలాపాలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారని, ప్రజల్లో భయాందోళనలు కలిగించే తప్పుడు వార్తలు, వ్యక్తుల పరువు ప్రతిష్టలకు భంగం కలిగించే వ్యాఖ్యలు, ప్రభుత్వసంస్థలు లేదా ప్రజాప్రతినిధుల పై అసత్య ఆరోపణలు, పార్టీ లమధ్య రెచ్చగోట్టె పోస్టులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సందేశాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వారిపై ఐటీ చట్టం మరియు భారతీయ న్యాయ సంహిత నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్ గ్రూపులు మరియు ఇతర సోషల్ మీడియా గ్రూపుల్లో అభ్యంతరకర పోస్టులు షేర్ చేసినా, వాటిని తొలగించకుండా అనుమతించినా సంబంధిత గ్రూప్ అడ్మిన్‌లు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గ్రూప్ అడ్మిన్‌లు తమ గ్రూపుల్లో జరిగే చర్చలను పర్యవేక్షిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పోస్టులను వెంటనే తొలగించాలని సూచించారు. సామాజిక సామరస్యానికి భంగం కలిగించే, మతాల మధ్య, కులాల మధ్య విద్వేషాలను పెంచే, యువతను తప్పుదారి పట్టించే పోస్టుల విషయంలో పోలీసులు ఏమాత్రం ఉపేక్షించబోరని ఎస్ఐ నవీన్‌కుమార్ హెచ్చరించారు. ప్రజలు ఏదైనా సందేశాన్ని ఇతరులకు ఫార్వర్డ్ చేయడానికి ముందు దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలని సూచించారు. అనుమానాస్పద పోస్టులు, తప్పుడు ప్రచారాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేసందేశాలు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీస్ హెల్ప్‌లైన్ 100,112కు సమాచారం అందించాలన్నారు. బాధ్యతాయుతమైన సోషల్ మీడియా వినియోగం ద్వారా సమాజంలో శాంతి, భద్రత, సామరస్య వాతావరణాన్ని కాపాడాలని ఎస్ ఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# సర్ అవగాహన పోస్టర్ ఆవిష్కరణ



**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 21 :** కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి బోగోజీ ముకేష్ కన్నా ఆధ్వర్యంలో రూపొందించిన సర్ కార్యక్రమంపై అవగాహన పోస్టర్ ను జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమంపై కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో సర్ కార్యక్రమంపై వాల్ పోస్టర్ రూపొందించడం అభినందనీయమన్నారు. ఓటు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న వారు తమ ఫోన్ నుండి 1950 నెంబర్‌కు ఈసిఐ అని టైప్ చేసి స్పేస్ ఇచ్చి ఓటర్ ఐడి కార్డు నెంబర్‌ను సెండ్ చేస్తే వారి సమాచారం తెలుస్తుందని తెలిపారు. ప్రజలందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్తమోహన్, గట్టు సతీష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దుమాల రాజ్ కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దయల శరత్, కాంగ్రెస్ సేవాదళ్ పట్టణ అధ్యక్షుడు దేవనపల్లి రాజేందర్, కార్యదర్శి నాగభూషణం, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పులి నరసయ్య, నాయకులు పంబాల రాము, చీటి లక్ష్మీనారాయణ, చాంద్ పాషా, ఫరూక్, క్రాంతి, పురుషోత్తం, జగన్, అంజన్న, రహీం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 20 :** అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున ఖర్గే పుట్టినరోజు సందర్భంగా మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, డిసిసి అధ్యక్షులు గాజెంగి నందయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, డిసిసి అధ్యక్షులు గాజెంగి నందయ్య కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కేంద్రంలోని ఎన్డిఎ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నారన్నారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఆయురారోగ్యాలతో జీవించాలని, ప్రజలకు మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త మోహన్, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, పట్టణ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో ఘనంగా ఆషాఢ మాస గోరింటాకు వేడుకలు

**-పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ అన్నం లావణ్య**



**చురకలు ప్రతినిధి కోరుట్ల జూలై 21 :** కోరుట్ల పట్టణంలో ఆషాఢ మాసం పురస్కరించుకొని మంగళవారం మహిళలు గోరింటాకు వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా గోరింటాకు తెచ్చుకుని, నూరుకొని చేతులకు పెట్టుకున్నారు. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల కలిగే ఆరోగ్య, ఆధ్యాత్మిక విశిష్టతలను ఈ సందర్భంగా మహిళలు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అన్నం లావణ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమెతో పాటు సంఘం గ్రామ సర్పంచ్ స్వరూప, మాజీ మార్కెట్ చైర్మన్ లక్ష్మి, మాజీ కౌన్సిలర్ రాధిక, ప్రముఖ మహిళా ప్రతినిధులు విజయ, నవ్య, కీర్తన, రజిత, జల, విజయ, సంగీత, శ్యామల, బుచ్చమ్మ, భూమిక, లలిత తదితరులు పాల్గొన్నారు. మహిళలందరూ ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకలో పాల్గొని గోరింటాకు విశిష్టతను చాటిచెప్పారు.

# స్వగ్రామానికి చేరిన రాహుల్ అస్థికలు



**చురకలు ప్రతినిధి కోరుట్ల జూలై 21 :** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి రాహుల్ అస్థికలు 52 రోజుల నిరీక్షణ అనంతరం మంగళవారం స్వగ్రామానికి చేరాయి. రాహుల్ అస్థికలు గ్రామానికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం ఐలాపూర్ గ్రామంలో కుటుంబ సభ్యులు సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలను నిర్వహించారు. రాహుల్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు ఆయనకు నివాళులర్పిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# రైతులల్లో చిగురించిన ఆశలు...

**- రెండు రోజులుగా మెస్తారుగా వర్షం**
**- పంటలకు ప్రాణం పోసిన వర్షం**
**- మొక్కజొన్న, పసుపు ,సోయాబీన్ పంటలకు ఆజ్యం**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జులై (21) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలంలోని గోదుర్,తిమ్మపుర్, తిమ్మపుర్ తండ,ఫకిర్ కోండాపుర్,యామపుర్, వేములకుర్తి, బర్దిపుర్, ములరాంపుర్, ఎర్దండి, కోమటికోండాపుర్, వర్షకోండ, డబ్బ, అమ్మకపెట్, ఎర్రాపుర్, ఇబ్రహింపట్నం, కేశాపుర్, కోజన్ కోత్తుర్ గ్రామలలో మంగళవారం కురిసిన మోస్తరు వర్షాలు రైతులకు కొత్త ఆశలు నింపాయి. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. విత్తనాలు వేసిన తర్వాత పంటలకు తగినంత తేమ అందక సోయాబీన్,మొక్కజొన్న,పసుపు పంటలు ఎదుగుదలలో వెనుకబడ్డాయి.కొన్ని ప్రాంతాల్లో మొక్కలు ఎండిపోయే పరిస్థితులు కూడా కనిపించాయి. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలు పరిస్థితిని పూర్తిగా మార్చేశాయి. మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన మోస్తరు వర్షం నారులకు జీవం పోసింది. ఎండకు వాడిపోయినట్లు కనిపించిన పంటలు మళ్లీ పచ్చదనాన్ని సంతరించుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సోయాబీన్, మొక్కజొన్న పంటలు ప్రస్తుతం కీలక ఎదుగుదల దశలో ఉండటంతో ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు వాపోయారు. పసుపు సాగు చేసిన రైతులకు కూడా ఈ వర్షం వరంలా మారింది. పసుపు పంటకు నిరంతర తేమ అవసరం ఉండటంతో వర్షం కురవడం వల్ల దిగుబడులపై ఆశలు పెరిగాయి. వ్యవసాయ నిపుణులు కూడా ఈ వర్షాలు పంటల పెరుగుదలకు అనుకూలమని మన్నారు.నేలలో తేమ పెరగడంతో ఎరువుల ప్రభావం కూడా మెరుగ్గా ఉంటుందన్నారు. వరి సాగు చేస్తున్న రైతుల పరిస్థితి మాత్రం కొంత భిన్నంగా ఉంది. వర్షాలు కురిసినా కాలువలు, చెరువులు, ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందితేనే వరి సాగు పూర్తి స్థాయిలో సాగుతుందని,నీటి విడుదలపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు. వర్షపు నీటిపై మాత్రమే ఆధారపడటం ప్రమాదకరమని,సాగునీరు అందుబాటు లో ఉంటేనే మంచి దిగుబడులు సాధించగలమని రైతులు అభిప్రాయ పడుతున్నారు.ఇటీవల వరకు వర్షాభావంతో నిరాశలో ఉన్న రైతాంగానికి తాజా వర్షాలు ఊరటనిచ్చాయి.వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన ఇబ్రహింపట్నం మండలంలో రైతుల ఆర్థిక పరిస్థితి పంటలపై ఆధారపడి ఉంటుంది. అందుకే ఈ వర్షాలు రైతుల ముఖాల్లో చిరునవ్వులు పూయించాయి. రానున్న రోజుల్లో కూడా సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు,కుంటలు, జలాశయాలు నిండాలని,వ్యవసాయం పుంజుకోవాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థులకు దాతల నుంచి నోట్‌బుక్స్ పంపిణీ

**చురకలు ప్రతినిధి కోరుట్ల జూలై 21 :** కోరుట్ల మండలం నాగులపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 102 మంది విద్యార్థులకు మంగళవారం గ్రామంలోని పాఠశాల స్వచ్ఛంద కమిటీ ఆధ్వర్యంలో రూ.18 వేల విలువైన ఫార్మేటివ్ అసెస్‌మెంట్ నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు సింగారెడ్డి నర్సారెడ్డి, లవంగాసాగర్ సింగారెడ్డి నవీన్‌రెడ్డి, వన తడుపుల స్వామి, ఆరే వెంకటి, కుంట రామకృష్ణ, ఉప్పురపెల్లి నాగరాజు, సింగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, లవంగ అరుణ్, డాక్టర్ ఎండి హజరత్ అలీ, ఇల్లెందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. గత విద్యా సంవత్సరంలో పాఠశాలలో 93 మంది విద్యార్థులు ఉండగా, వారిలో 17 మంది పదో తరగతి పూర్తి చేసి వెళ్లడంతో మిగిలిన 76 మంది విద్యార్థులకు అనుగుణంగా




ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను వేసవి సెలవుల్లో అందించింది. అనంతరం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్య గురించి వివరించి ఒప్పించడంతో విద్యార్థుల సంఖ్య 104కు పెరిగింది. కొత్తగా చేరిన 20 మంది విద్యార్థులకు అవసరమైన నోట్‌బుక్స్‌ను ఉపాధ్యాయులు తమ సొంత నిధులతో సమకూర్చగా, వారి సేవలను అభినందించిన స్వచ్ఛంద కమిటీ మన బడి - మన బాధ్యత అనే నినాదంతో ముందుకు వచ్చి విద్యార్థులకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ నోట్‌బుక్స్ అందజేసింది. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తామని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించి మరింత మంది విద్యార్థులను ఆకర్షించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల పట్ల ఉన్న ఆదరణకు నిదర్శనంగా నిలిచింది.



# తిరుపతిలో న్యూ విజన్ స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శన

**-మాస్టర్ శ్రీవాణి, విద్యార్థులకు సత్కారం**

**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (21) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామానికి చెందిన న్యూవిజన్ కాన్వెంట్ స్కూల్ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకున్నారు.



తిరుపతిలోని మీనాక్షి నృత్య కళా నిలయం మహతి ఆడిటోరియంలో అభినయ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య పోటీలలో న్యూ విజన్ స్కూల్ విద్యార్థులు పాల్గొని అద్భుతమైన నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. తమ కళా ప్రతిభ తో ప్రేక్షకులను ఆకట్టుకుని ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా అభినయ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవ స్థాపకులు బి.ఎన్.రెడ్డి,నాట్య గురువు నాట్య మయూరి మాస్టర్ శ్రీవాణి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. న్యూ విజన్ కాన్వెంట్ స్కూల్ కరస్పాండెంట్‌ని సత్కరించి జ్ఞాపికలు అంద జేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యా యులు,పాల్గొని విద్యార్థులను అభి నందించారు. విద్యార్థుల విజయం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## 14వ వార్డులో బోరు మోటార్ ప్రారంభం

**-మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్**



**చురకలు ప్రతినిధి కోరుట్ల జూలై,21 :** కోరుట్ల పట్టణంలోని 14వ వార్డులో తాగునీటి ఎద్దడి కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంగళవారం స్థానిక వార్డు కౌన్సిలర్ రేంజర్ల కళ్యాణి మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన మున్సిపల్ అధికారులు నూతన బోరు మోటార్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ స్థానిక వార్డు కౌన్సిలర్ రేంజర్ల కళ్యాణితో కలిసి కొబ్బరికాయ కొట్టి బోరు మోటార్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దండవేణి వెంకటేష్,రిజ్వాన్,వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు. కొత్త బోరు మోటార్ అందుబాటులోకి రావడంతో 14వ వార్డు ప్రజలకు తాగునీటి సమస్య కొంతవరకు పరిష్కారం కానుంది.

## మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్‌ను పరిశీలించిన ఎంపీడీవో గణేష్



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (21) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్‌ను మండల అభివృద్ధి అధికారి సీహెచ్ గణేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు అందుతున్న తాగునీటి సరఫరా విధానాన్ని ఎంపీఓ రామకృష్ణరాజుతో కలిసి సమీక్షించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ సిబ్బందికి ఆదేశించారు. డబ్బ గ్రామంలో నిర్మిస్తున్న ఇంకుడు గుంతల పనులను పరిశీలించి,వాటి నిర్మాణ నాణ్యత, పురోగతిపై అధికారులకు సూచనలు చేశారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు పారదర్శకంగా,నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులకు ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈలు మల్లేష్, వింధ్యారాణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి రవళి తదితరులు పాల్గొన్నారు.

## మేడారం తండాలో ఘనంగా తీజ్ ఉత్సవాలు



**చురకలు విలేకరి, సారంగాపూర్, జూలై 21 :** సారంగాపూర్ మండలం రేచపెల్లి మేడారం తండాలో మంగళవారం తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా తీజ్ ఉత్సవాలు జరుపుతూ వర్షాలు కురిసి పంటలు పండాలని లంబాడి నృత్యాలతో ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ భూక్య సరళ, సర్పంచ్ భుక్యా బారతి చిరంజీవి, మాజీ ఎంపీటీసీ భుక్యా లావణ్య దివ్య భారతి, సుజాత, ఎడి జవహర్ లాల్ నాయక్, ఉపసర్పంచ్ గద్దర్, మాజీ సర్పంచ్ భుక్యా అరుణ్ ప్రకాష్, పురుశోత్తం, బీర మహేష్ పాల్గొన్నారు.

### డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణలో

# విద్యార్థుల పాత్ర కీలకం

**-చదువుతో పాటు క్రమశిక్షణ, సామాజిక బాధ్యత కూడా అలవర్చుకోవాలి**

**సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి**




**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 21 :** డ్రగ్స్, గంజాయి వంటి మాధకద్రవ్యాలు, సైబర్ నేరాలు,రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి విద్యార్థులకు సూచించారు.మంగళవారం రోజున ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రాచర్ల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే గారి ఆదేశాల మేరకు డ్రగ్స్ వలన కలుగు దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు,రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని, కుటుంబాలను, భవిష్యత్తును నాశనం చేస్తాయని తెలిపారు.ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు, నకిలీ వెబ్సైట్లను నమ్మవద్దని సూచించారు.ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్వర్డ్ ఎవరికీ వెల్లడించవద్దని తెలిపారు.సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు వివరించారు.రోడ్డు ప్రమాదాల నివారణలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని,ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించడం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగించడం, మైనర్లు వాహనాలు నడపకుండా ఉండడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయకుండా ఇతరులకు కూడా అవగాహన కల్పించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.చదువుతో పాటు క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను కూడా విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. మంచి అలవాట్లు, నైతిక విలువలు, చట్టాల పట్ల గౌరవం మరియు సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించడం ద్వారా విద్యార్థులు తమ భవిష్యత్తును విజయవంతంగా తీర్చిదిద్దుకోవడంతో పాటు సమాజ అభివృద్ధికి కూడా తోడ్పడగలరని తెలిపారు.ఈకార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సర్కిల్ సి.ఐ వెంకటేష్, ఎస్.ఐ రాహుల్ రెడ్డి,కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలి

**-ఆర్జీ త్రీ, జియం**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 21 :** ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు.కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు "ఏక్ పెడ్ మాకే నామ్" కార్యక్రమంలో భాగంగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ వారి ఆదేశాల మేరకు మంగళవారం సింగరేణి వ్యాప్తంగా ఒక్కొక్క ఏరియాకు పదివేల మొక్కలు నాటే కార్యక్రమం "మాసివ్ ప్లాంటేషన్ డ్రైవ్" (మెగా ప్లాంటేషన్) నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా రామగుండం-3 ఏరియాలోని ఓసిపి-1, ఓసిపి-2 ఉపరితల గనుల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓసిపి-2 ఉపరితల గని ఆవరణలో జరిగిన కార్యక్రమానికి రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ పర్యావరణాన్ని పరిరక్షించడానికి ఎన్నో పర్యావరణహిత కార్యక్రమాలు చేపట్టి, ఉద్యోగుల చేత లక్షలాది మొక్కలు నాటించడం, వాటిని సంరక్షించడం జరుగుతుందని, అంతే కాకుండా చెట్లను పెంచడం వలన కలిగే లాభాలను తెలియజేస్తూ, అవగాహన కల్పిస్తూ పరిసర గ్రామాల ప్రజలకు మొక్కలను పంపిణీ చేయించి, నాటించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వీలైనన్ని మొక్కలు నాటుతూ, నాటిస్తూ వాటిని సంరక్షిస్తూ, జీవన వైవిధ్య పరిరక్షణకు కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఎస్వోటు జియం యం.రామ్మోహన్, ఏరియా ఇంజనీర్ ఏ. ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, ఏరియా పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి, విభాగధిపతులు బి.టి.మురళీకృష్ణ, బి. సుదర్శనం, కె.ఐలయ్య,షబ్బీరుద్దీన్,ఆసిఫ్ యాసిన్, ఆర్. రాజేశ్వరి, మేఘన, భరత్ కుమార్ లతో పాటు ఇతర విభాగతిపతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఓటరు నమోదు సవరణ కార్యక్రమంను

# పరిశీలించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 21 :** ఎల్లారెడ్డిపేట మండలం లోని రాచర్ల తిమ్మాపూర్,బండలింగపల్లి గ్రామాలలో ఓటరు నమోదు సవరణ సర్ కార్యక్రమంను రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ బీఎల్ఓ లు బి ఎల్ఏలు అప్రమత్తంగా ఉండి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తూ, సర్ ప్రతులు ఇంకా అందజేయని ఇంటికి వెళ్లి అందజేసేవిదంగా వారికి అవగాహన కల్పించాలని ప్రతి ఒక్క ఓటు కీలకమని నమోదు చేసే బాధ్యత ప్రతి ఒక కార్యకర్త పూర్తి చేయించాల్సిన అవసరం ఏంతైన ఉందన్నారు అదేవిధంగా ఈ ప్రక్రియను తొందరగా ఆన్లైన్ చేసి సిరిసిల్ల జిల్లాలోని ఎల్లాడిపేటను ప్రథమ స్థానంలో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుడిద రాజేందర్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు దొమ్మటి నరసయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి, గౌస్, గుర్రాల రాజిరెడ్డి, తిమ్మాపూర్ ఉప సర్పంచ్ లు దేవేందర్, కిషన్,బాలు, మర్రి శ్రీనివాస్ రెడ్డి,మూర్తి వెంకట్, దండు శ్రీనివాస్, భాస్కర్ జాదవ్, తిరుపతి నాయక్, పిఏసి ఎస్ డైరెక్టర్ లక్ష్మణ్, లక్ష్మారెడ్డి,షాదీక్, సంజీవ్ రెడ్డి, సాయిప్రేమ్,గుడ్ల శ్రీనివాస్,సత్తయ్య, రమేష్, ఇతర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## నూతన నియామకం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 21 :** మున్నూరు కాపు సంఘం తెలంగాణ మంథని నియోజకవర్గ ఇంచార్జిగా లక్కాకుల మధుకర్ నియామకం చేసినట్లు ఇన్చార్జి తోట రాజ్ కుమార్ తెలిపారు.పెద్దపల్లి జిల్లాలో మంగళవారం నిర్వహించిన నూతన జిల్లా కమిటీ సమావేశంలో మున్నూరు కాపు సంఘం తెలంగాణ మంథని నియోజకవర్గ ఇంచార్జిగా లక్కాకుల మధుకర్‌ని నియమిస్తూ, మున్నూరు కాపు సంఘం తెలంగాణ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గంగుల రాజేంద్ర ప్రసాద్ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం తెలంగాణ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు భూతం రాజేష్,పెద్దపల్లి జిల్లా సోషల్ మీడియా ఇంచార్జి గంప వంశీకృష్ణ గారు,కుల బంధువులు తోట రాజ్‌కుమార్ గంగుల రాంప్రసాద్,గుంటుకు అంజనీ ప్రసాద్,గంగుల మారుతీ, ఎలువక రాకేష్,గంగుల నితిన్ రాజ్,రాజ,మైదాం వినయ్,గంగుల రాజు,ఎలువక గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్.వంద శాతం పూర్తి చేయడమే లక్ష్యం



**చురకలు విలేఖరి వీణవంక జూలై 21 :** వీణవంక మండలంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎక్కడి రఘుపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ ఐ ఆర్ లో ప్రతి అర్హుడైన ఓటరు,ఓటరు జాబితాలో వారి పేరు ఉండేలా చూడటం మనందరి బాధ్యత. ఒక్క అర్హుడైనా మిగిలిపోకుండా ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను పరిశీలించాలి.ప్రతి బిఎల్ ఏ ప్రతి కోఆర్డినేటర్ తమకు అప్పగించిన బాధ్యతను సేవాభావంతో నిర్వర్తించాలి. మండలంలో 100% శాతం పూర్తి పూర్తి చేయాలని కోరారు. గంగాడి తిరుపతిరెడ్డి,సాహెబ్ హుస్సేన్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, సర్పంచులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిపి కార్మికులకు జీతాలు పెంచాలి



**చురకలు విలేఖరి వీణవంక జూలై 21 :** వీణవంక మండలం చల్లూరు గ్రామంలో మంగళవారం కార్మికులతో కలిసి సమస్యలు తెలుసుకొని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడారు.జి.పి.కార్మికుల కనీస వేతనం రూ.. 26 వేలు చెల్లించాలని, ఎన్నికల ముందు సీఎం ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగ భద్రత కనీస వేతనం అమలు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులకు ప్రతినెల ఒకటో తేదీ నుండి పదవ తేదీ లోపు వేతనాలు నేరుగా బ్యాంక్ అకౌంట్ ద్వారా ఖాతాలలో జమ చేయాలని, కార్మికులందరికీ పిఎఫ్, ఈఎస్ఐ,ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని, ఆన్లైన్లో పేర్లు నమోదు లేని కార్మికుల పేర్లను వెంటనే నమోదు చేయాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పిల్లి రవి యాదవ్, కరోబార్ యూనియన్ నాయకులు కొమ్ము ప్రేమ్ కుమార్, సిబ్బంది గోడిశాల కొమురయ్య, సులేమాన్, తిరుపతి, రాజు రాజేశ్వరి మల్లక్క,సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సీఎంను కలిసిన దళిత ఎమ్మెల్యేలు



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ జూలై 21 :** రాష్ట్ర ముఖ్యమంత్రిని దళిత ఎమ్మెల్యేల బృందం శనివారం మర్యాదపూర్వకంగా కలిసింది.టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నేతృత్వంలో ఎస్సీ ప్రజాప్రతినిధులు సీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు.రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, తమ తమ నియోజకవర్గాల అభివృద్ధి పనులు,పెండింగ్ సమస్యలు తదితర అంశాలపై సీఎంతో వారు చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు సూచించారు.అలాగే నియోజకవర్గాల వారీగా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు.దళిత వర్గాల సంక్షేమం, సామాజిక న్యాయం, విద్య, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమావేశంలో దళిత ఎమ్మెల్యేలు పాల్గొని తమ నియోజకవర్గాలకు సంబంధించిన అభివృద్ధి ప్రతిపాదనలు,ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వచ్చారు.ముఖ్యంగా శుక్రవారం జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలను ఈ సందర్భంగా వివరించారు.

### హుజురాబాద్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం

# అధ్యక్షునిగా గంజి జయవర్ధన్



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూలై 22 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్ ఉద్యోగుల సంఘం హుజురాబాద్ యూనిట్ అధ్యక్షునిగా గంజి జయవర్ధన్ మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హుజురాబాద్ యూనిట్ అధ్యక్షునిగా పనిచేసిన మహమ్మద్ ఉస్మాన్ పాషా ఫిబ్రవరి 2026 లో జరిగిన సంఘం జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన విషయం తెలిసిందే. దీంతో అసోసియేట్ అధ్యక్షులుగా ఉన్న లక్ష్మయ్య ఇంచార్జ్‌గా పనిచేశారు. జిల్లా సంఘం సూచనల మేరకు అధ్యక్ష స్థానానికి మంగళవారం ఎన్నికల అధికారి దొంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా ఉన్న గంజి జయవర్ధన్ అధ్యక్షస్థానానికి నామినేషన్ వేశారు. ఒకే ఒక నామినేషన్ రావడంతో ఎన్నికల అధికారి దొంత శ్రీనివాస్ గంజి జయవర్ధన్ ను అధ్యక్షునిగా ప్రకటించారు. ఎన్నికల అధికారి దొంత శ్రీనివాస్ ఎన్నికల పరిశీలకులుగా జై మనోహర్ గౌడ్ వ్యవహరించారు. ఎన్నిక ఏకగ్రీవం అయ్యేందుకు సహకరించిన రిటైర్డ్ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల అధికారి దొంత శ్రీనివాస్,ఎన్నికల పరిశీలకులు గా జై మనోహర్ గౌడ్ వ్యవహరించగా వారికి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రభుత్వం పిఆర్సి ఇస్తుందనే నమ్మకం ఉంది : జిల్లా అధ్యక్షుడు ఉస్మాన్ పాషా**

ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా సంఘం అధ్యక్షులు మహమ్మద్ ఉస్మాన్ పాషా మాట్లాడుతూ హుజురాబాద్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘానికి ఒక మంచి గుర్తింపు ఉందని, రెండుసార్లు భవనాల నిర్మాణం పూర్తి చేసి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపామని తెలిపారు. సభ్యుల ఐక్యత తో పాటు సహకారంతోనే ఇది సాధ్యమైంది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్ ఉద్యోగులకు హామీ ఇచ్చిన విధంగా నిర్ణీత కాల వ్యవధిలోనే పి ఆర్ సి అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. హెల్త్ కార్డుల జారీ కూడా ప్రభుత్వం అనుకున్న సమయంలో అందించిందని తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డికి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. రిటైర్ ఉద్యోగుల డీఏలు, పెండింగ్ బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుందనే నమ్మకం ఉందని తెలిపారు.

**హుజురాబాద్ సంఘానికి ప్రత్యేక గుర్తింపు : జిల్లా నేతలు**

ఎన్నికల అధికారిగా పనిచేసిన దొంత శ్రీనివాస్, ఎన్నికల పరిశీలకులు జై మనోహర్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలోనే హుజురాబాద్ యూనిట్లో పెద్ద సంఖ్యలో 534 సభ్యులు ఉన్నారని, ప్రభుత్వ స్థలంలో రెండు భవనాలు నిర్మాణం చేసి జిల్లాలోని ఎక్కడ లేనివిధంగా గుర్తింపు పొందిందని తెలిపారు. గతంలో పనిచేసిన అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గం ఐక్యతతో, సభ్యుల ఆర్థిక సహాయంతో, పట్టుదలతో పనిచేశారని ప్రశంసించారు.

**సమస్యలు పరిష్కరిస్తా: కొత్త అధ్యక్షుడు గంజి జయవర్ధన్**

తన ఎన్నికకు సహకరించిన సభ్యులకు కొత్త అధ్యక్షునిగా ఎన్నికైన గంజి జయవర్ధన్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రిటైర్ ఉద్యోగులందరికీ శక్తి వంచన లేకుండా జిల్లా కమిటీ సహకారంతో సమస్యల పరిష్కారానికి చేస్తానని ,ఏ రిటైర్ ఉద్యోగి కూడా ఇబ్బందులు కలగకుండా ముందుండి కార్యవర్గంతో చర్చించి అన్ని పనులు చేస్తామని హామీ ఇచ్చారు. పలువురు సభ్యులు జిల్లా కమిటీ నాయకులు ఈ సందర్భంగా జయవర్ధన్ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంఘ జాయింట్ సెక్రెటరీ వీరస్వామి, అసోసియేట్ అధ్యక్షులు ఇన్చార్జి అధ్యక్షులు లక్ష్మయ్య, హుజురాబాద్ యూనిట్ కార్యవర్గ సభ్యులు, హుజురాబాద్ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్‌లో వర్షపు నీటి సంరక్షణపై పోటీలు

### -విజేతలకు బహుమతుల ప్రదానం

**చురకలు ప్రతినిధి కోరుట్ల, జూలై 21 :** వర్షపు నీటిని పట్టుకోండి – భవిష్యత్తును కాపాడండి అనే నినాదంతో స్థానిక ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వర్షపు నీటి సంరక్షణ (రైన్ వాటర్ హార్వెస్టింగ్) , ఇంకుడు గుంతల ప్రాముఖ్యతపై డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు తమ సృజనాత్మకతను, పర్యావరణ పరిరక్షణపై అవగాహనను ప్రతిబింబించేలా అద్భుతమైన చిత్రాలు, వ్యాసాలు రూపొందించి ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోరుట్ల మున్సిపల్ కమిషనర్ వి.రాఘవేంద్ర మాట్లాడుతూ, భూగర్భ జలాల మట్టం పెరగడానికి ఇంకుడు గుంతలు ఎంతో అవసరం. ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా ప్రతి బొట్టును సంరక్షించాలి. లేకపోతే భవిష్యత్తులో తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సి వస్తుంది. వర్షపు నీటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, మున్సిపాలిటీ డి.ఈ.ఈ. అరుణ్ కుమార్, డిప్యూటీ డి.ఈ.ఓ., పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం



**చురకలు ప్రతినిధి కోరుట్ల, జూలై 21 :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోరుట్లలో 2026–27 విద్యా సంవత్సరానికి వివిధ సబ్జెక్టులలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నడికట్ల సందీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ (1), గణిత శాస్త్రం (1), తెలుగు (1), రసాయన శాస్త్రం (1), డైరీ సైన్స్ (1), చరిత్ర (1) విభాగాల్లో అతిథి అధ్యాపకుల అవసరం ఉందన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీలో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉంటే సరిపోతుందని తెలిపారు. పీహెచ్‌డీ నెట్ సెట్ అర్హతలు కలిగిన వారికి అలాగే బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు జూలై 23లోగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కళాశాల పని దినాల్లో తమ దరఖాస్తులతో పాటు సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులను ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోరుట్లలో సమర్పించాలని సూచించారు.జూలై 24 (శుక్రవారం) ఉదయం 10 గంటలకు ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. తుది నియామకాలు కళాశాల విద్యాశాఖ కమిషనర్ జారీ చేసిన నిబంధనలకు లోబడి ఉంటాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోరుట్ల కార్యాలయాన్ని సంప్రదించాలని ప్రిన్సిపాల్ నడికట్ల సందీప్ తెలిపారు.


## ఆర్టీసీ బస్సు అపహరణ కలకలం

**-వెంబడించి నిందితుడిని పట్టుకున్న పోలీసులు**



**చురకలు ప్రతినిధి కోరుట్ల, జూలై 21 :** జగిత్యాల జిల్లా కోరుట్ల బస్టాండ్‌లో మంగళవారం సంచలన ఘటన చోటుచేసుకుంది. బస్టాండ్‌లోని ప్లాట్‌ఫామ్ వద్ద నిలిపి ఉంచిన ఆర్టీసీ బస్సును ఓ వ్యక్తి అకస్మాత్తుగా అపహరించి నిజామాబాద్ వైపు వేగంగా తీసుకెళ్లడంతో తీవ్ర కలకలం రేగింది. బస్సును అదుపు తప్పిన వేగంతో నడిపిన దుండగుడు మార్గమధ్యంలో పలు వాహనాలను ఢీకొట్టడంతో పాటు పోలీసు వాహనాన్ని కూడా ఢీకొట్టాడు.ఈ ఘటనలో పలువురికి గాయాలైనట్లు సమాచారం.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అప్రమత్తమై బస్సును వెంబడించారు. మెట్లపల్లి మండలం గండి హనుమాన్ దేవాలయం సమీపంలో బస్సు రోడ్డుపక్కనున్న గుంతలోకి దిగి నిలిచిపోయింది. అనంతరం అక్కడి నుంచి కాలినడకన పారిపోవడానికి ప్రయత్నించిన నిందితుడిని పోలీసులు వెంటాడి అదుపులోకి తీసుకుని మెట్లపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, నిందితుడి వివరాలు, బస్సును అపహరించిన కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు. అలాగే గాయపడిన వారి పరిస్థితి, ఆస్తి నష్టంపై వివరాలు సేకరిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోంది.

## గ్యాస్ కనెక్షన్ పేరు మార్పుకు వెయ్యి డిమాండ్..?



**చురకలు విలేకరి, మల్లాపూర్, జూలై 21:** మండల కేంద్రంలోని ఇండియన్ గ్యాస్ ఆఫీస్ లో పేరు మార్పు కోసం వెయ్యి రూపాయలని అడిగిన మేనేజిమెంట్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఆన్లైన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళ్తే మండల కేంద్రానికి చెందిన ఏనుగు వెంకట్ రెడ్డి తన తండ్రి మృతి చెందడంతో తండ్రి పేరున ఉన్న గ్యాస్ కనెక్షన్ ను ఈ నెల 18న ఇండియన్ గ్యాస్ కార్యాలయానికి వెళ్లి పేరు మార్పు కోసం వెళ్లగా నిర్వాహకుడు తోట రాజం, అందులో విధులు నిర్వహించే వ్యక్తి ఇద్దరు కలసి రూ.1000 డిమాండ్ చేసి పేపర్ వర్కు కోసం డబ్బులు ఇవ్వాల్సిందే అని దబాయించినట్లు బాధితుడు పేర్కొన్నారు. అలాగే బాధితుడు దీనికి సంబంధించి రసీదు ఇవ్వమని కోరగా రసీదులు ఇవ్వమంటే ఇవ్వమనట్లు బాధితుడు తెలిపారు. దీనిపై జిల్లా జాయింట్ కలెక్టర్, దానితో పాటు తహసీల్దార్ రాంచందర్ కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

# జాతీయ రహదారులపై ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

**-స్పెషల్ సీఎస్, రవాణా రోడ్లు భవనాల శాఖ వికాస్ రాజ్**
**-హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, జూలై 21 :** జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యమని స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్ స్పష్టం చేశారు.జాతీయ రహదారులపై రోడ్డు భద్రత చర్యలపై స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, పోలీస్ శాఖ, జాతీయ రహదారి శాఖ అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.స్పెషల్ సీఎస్, రవాణా రోడ్డు భవనాల శాఖ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారుల వెంట భారీ వాహనాలు, ట్రక్కులు పార్కింగ్ చేయవద్దని సూచించారు. నిర్దేశిత ప్రాంతాలు మినహా ఎక్కడా వాహనాలు పార్కింగ్ చేయవద్దని స్పష్టం చేశారు. అలాగే రోడ్డుపై ఆక్రమణలు ఉండకుండా చూడాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు అధికారులు, పోలీసులు, జాతీయ రహదారుల అధికారులతో టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అలాగే జాతీయ రహదారుల వెంట పోలీస్, రవాణా శాఖ అధికారుల పెట్రోలింగ్ చేసేలా చూడాలని సూచించారు.ఆ వాహనంలో అత్యవసర సేవలు అందించే సామాగ్రి అందుబాటులో ఉండాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తమ జిల్లా పరిధిలో అన్ని ఆసుపత్రుల వివరాలు, ట్రామా కేర్ సెంటర్ల వివరాలు మ్యాపింగ్ చేసి అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాలని సూచించారు. అన్ని జిల్లాల్లో బ్లాక్ స్పాట్స్ గుర్తించి.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ప్రభుత్వ ఆదేశాలు పక్కాగా అమలు**

రోడ్డు భద్రత కింద జారీ చేసిన ఆదేశాలను జిల్లాలో పక్కాగా అమలు చేస్తామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ జాతీయ రహదారుల వెంట గుర్తించిన బ్లాక్ స్పాట్స్ సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన పనులపై ఆరా తీసి.. భవిష్యత్తు ప్రణాళికలపై దిశా నిర్దేశం చేశారు.వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా వైద్యాధికారి ఏంజెలా అల్పోడ్, ఆర్అండ్ బీ డీఈలు శాంతయ్య, వరప్రసాద్, పోలీస్, నేషనల్ హై వే అధికారులు పాల్గొన్నారు.

# భారీ వర్షంలోనూ జర్నలిస్టుల గర్జన

**-అక్రిడిటేషన్ కార్డుల జాప్యంపై రోడ్డెక్కిన జర్నలిస్టులు**
**-అర్హులందరికీ వెంటనే కార్డులు ఇవ్వాలని డిమాండ్**




**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, జూలై 21 :** అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో జరుగుతున్న తీవ్ర జాప్యానికి నిరసనగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఖజెజె-ఎ143) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన "చలో కలెక్టరేట్" కార్యక్రమం భారీ విజయాన్ని సాధించింది. జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామల గట్టు నాయకత్వంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన జర్నలిస్టులు భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కలెక్టరేట్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా మాట్లాడుతూ, అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో అర్హులైన జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయకుండా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడం వల్ల జర్నలిస్టులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రయాణ సౌకర్యాలు, ఇతర అధికారిక గుర్తింపు ప్రయోజనాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆరు నెలల్లో బస్సు పాస్‌ను ఆరుసార్లు రెన్యువల్ చేయించుకోవాల్సిన దుస్థితి రావడం తెలంగాణ జర్నలిస్టు సమాజాన్ని అవమానించే చర్యేనని మండిపడ్డారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా వ్యవహరిస్తున్న జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డుల కోసం భారీ వర్షంలోనూ రోడ్డెక్కాల్సిన పరిస్థితి ప్రజాస్వామ్య ప్రభుత్వానికి ఏమాత్రం మంచిది కాదని హెచ్చరిస్తూ, ప్రభుత్వం ఇకనైనా స్పందించి అర్హులందరికీ వెంటనే పారదర్శకంగా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల భారీ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ధర్నా జరుగుతున్న విషయం తెలుసుకున్న కలెక్టరేట్ అధికారి అక్కడికి చేరుకుని నాయకుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో నిరసన కార్యక్రమాన్ని విరమించారు.ఈ సందర్భంగా "జై తెలంగాణ... జై జై తెలంగాణ", "జోహార్ తెలంగాణ జర్నలిస్టు అమరవీరులు", "వుయ్ వాంట్ జస్టిస్", "అర్హులైన ప్రతి జర్నలిస్టుకు వెంటనే అక్రిడిటేషన్ కార్డు ఇవ్వాలి" అంటూ జర్నలిస్టులు నినాదాలు చేయడంతో కలెక్టరేట్ ప్రాంతం మారుమోగింది.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులు, సీనియర్ జర్నలిస్టులు, ఎలక్ట్రానిక్ , ప్రింట్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయిలో మెరిసిన నిర్మల్ పోలీసు శునక దళం



**చురకలు ప్రతినిధి,నిర్మల్, జూలై, 21 :** తెలంగాణ పోలీసు ఇంటెలిజెన్స్ విభాగం విడుదల చేసిన 2026 తొలి అర్ధవార్షిక సేవా నివేదిక (జనవరి--జూన్) లో నిర్మల్ జిల్లా పోలీసు శునక దళం అత్యుత్తమ పనితీరుకు రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు దక్కాయి. ఈ నివేదికలో నిర్మల్ జిల్లా పరిధిలో నమోదైన హత్య, అనుమానాస్పద మృతి, దొంగతనం, ఆలయ చోరీ, మాదకద్రవ్యాల కేసులతో పాటు పలు కీలక కేసుల్లో పోలీసు శునకాలు" యామి, జెస్సీ, బోల్ట్" సంఘటన స్థలాల్లో కీలక ఆధారాలను గుర్తించడం, నిందితుల జాడలను కనిపెట్టడం, దర్యాప్తును వేగవంతం చేయడంలో విశేష పాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శునకాలతో సమన్వయంగా విధులు నిర్వహించి కేసుల ఛేదనలో కీలక పాత్ర పోషించిన ఏఆర్ఎస్ఐ జి. పరమేశ్వర్, ఏఆర్ఎస్ఐ కె. శ్రీనివాస్, ఏఆర్ఎస్ఐ జి. సాయేందర్లను జిల్లా ఎస్పీ.జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.ఎస్పీ మాట్లాడుతూ, నేరాల దర్యాప్తులో శునక దళం అందించే సేవలు అమూల్యమైనవని, శాస్త్రీయ దర్యాప్తులో పోలీసు శునకాల పాత్ర రోజురోజుకూ మరింత కీలకంగా మారుతోందని తెలిపారు. ఇదే నిబద్ధత, క్రమశిక్షణతో భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకు రావాలని డాగ్ హ్యాండ్లర్లను ప్రోత్సహించారు. నిర్మల్ జిల్లా పోలీసు శునక దళం సాధించిన ఈరాష్ట్రస్థాయి గుర్తింపు జిల్లా పోలీసు శాఖకు గర్వకారణమని జిల్లా ఎస్పీ.జానకి షర్మిల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, జిల్లా డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ ఆర్ఐ శేఖర్ ,రామకృష్ణ , ఆర్ఎస్ఐలు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## రాయపట్నంలో కేటీఆర్‌కు ఘన స్వాగతం



**చురకలు విలేకరి, ధర్మపురి, జూలై 21 :** ధర్మపురి మండలంలోని రాయపట్నం స్టేజి వద్ద బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కు మండల నాయకులు ఘన స్వాగతం పలికారు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్కు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ లకు మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, ప్రజాప్రతినిధులు, నాయకులు, గులాబీ శ్రేణులు వారికి ఘనంగా, ఘన స్వాగతం పలికారు. నాయకుల రాకతో రాయపట్నం చౌరస్తా గులాబీ మయంగా మారింది.పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు జై బిఆర్ఎస్, కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ చేసిన నినాదాలతో ప్రాంతం మారుమోగింది.గులాబీ శ్రేణులు,స్థానిక నాయకులు కేటీఆర్ ను కొప్పుల ఈశ్వర్‌ను పూల దండలు వేసి శాలువాలు కప్పి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

## అంజన్న సన్నిధిలో వైభవంగా వరుణ జపం...వరుణ యాగం



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 21 :** ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ, దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం స్థానాచారి కపిందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, ఉప ప్రధాన అర్చక చిరంజీవి, మారుతి ప్రసాద్, చిన్న రాము వేద పండితులు రాజేశ్వర శర్మ, పెద్దన్న శర్మ, తేజ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా వరుణ జపం, వరుణ యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయస్వామి వారికి విశేష అభిషేకం నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు అనుకూలంగా సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని వేద మంత్రోచ్చారణల మధ్య వరుణ జపం, వరుణ యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్. అంజనారెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి హరిహరనాథ్, సూపరింటెండెంట్లు సునీల్, చంద్రశేఖర్తో పాటు ఆలయ అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాము కాటుతో నాలుగేళ్ల బాలుడు మృతి



**చురకలు విలేకరి, ధర్మపురి, జూలై 21 :** ధర్మపురి పట్టణంలోని దుర్గా కాలనీకి చెందిన ముస్కు లోకేష్ పాము కాటు గురై మృతి చెందాడు. మంగళవారం తెల్లవారు జామున బహిర్భూమికి వెళ్లిన లోకేష్ ను పాము కాటు వేయడంతో అపస్మారక స్థితిలో వెళ్లగా హుటాహుటిన ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. చికిత్స పొందుతూ లోకేష్(4) మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ధర్మపురి ఎస్సై గురుక మహేష్ పరిశీలించి తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై కలెక్టర్ సమీక్ష

**చురకలు ప్రతినిధి,నిర్మల్, జూలై, 21 :** మారుమూల గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం కుంటాల మండలంలోని అంబుగాం గ్రామంలో పర్యటించిన కలెక్టర్ గ్రామంలోని తాగునీటి వసతి, విద్యుత్, టెలికాం సేవలు, ఇతర మౌలిక సదుపాయాలపై స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామస్తులకు ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉన్న నేపథ్యంలో గ్రామపంచాయతీ తీర్మానం చేసి



ప్రతిపాదనలు పంపితే వెంటనే నూతన బోరుబావి మంజూరు చేస్తామని తెలిపారు.బోరుబావి ఏర్పాటు చేయ నున్న ప్రాంతాన్ని,ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.భూగర్భ జలాల సంరక్షణ కు ఫామ్‌పాండ్‌లు అత్యంత ఉపయోగ కరమని పేర్కొన్న కలెక్టర్, ప్రతి రైతు తన వ్యవసాయ క్షేత్రంలో ఫామ్ పాండ్ నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని రైతు ఏర్పాటు చేసిన ఫామ్ పాండ్‌ను పరిశీలించి, ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న రైతులతో పాటు కొత్తగా ముందుకు వస్తున్న రైతులను అభినందించారు. గ్రామంలో మరిన్ని ఫామ్ పాండ్‌లు ఏర్పాటయ్యేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే గ్రామంలో టెలికాం సేవల మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూగర్భ జలాల పరిరక్షణలో ప్రతి గ్రామస్థుడు భాగస్వామి కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీఓ వనజ, సర్పంచ్ శివాజీ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

**-అదనపు తరగతి గదుల నిర్మాణంపై అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**చురకలు విలేకరి, మల్లాపూర్, జూలై 21 :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన మౌలిక వసతులను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.



మంగళవారం మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలోని జడ్పీ హై స్కూల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం పాఠశాలకు మొత్తం 39 తరగతి గదులు అవసరం కాగా, ప్రస్తుతం 16 తరగతి గదులు అందుబాటులో ఉన్నాయని, ఇంకా 23 అదనపు తరగతి గదులు నిర్మించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఇందుకు సుమారు రూ.12 కోట్ల అంచనా వ్యయం ఉంటుందని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తగిన తరగతి గదులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్న కలెక్టర్, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సౌకర్యవంత మైన విద్యావాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహ రావు, తహసీల్దార్ రాంచందర్, ఏఈఈ శేషు కుమార్, ధనుంజయ్, టీజీఈడబ్ల్యూఐడీసీ, సంబంధిత అధికారులు, గ్రామస్తులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారానికి

# ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలి

**-జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూలై 21 :** ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ, పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను నిరంతరం పర్యవేక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే మంగళవారం రోజున తంగాళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, పెట్రోలింగ్ నిర్వహణ, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా సమీక్షించి, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై ప్రత్యేకంగా ఆరా తీశారు.ఈసందర్భంగా ఎస్పీ



మాట్లాడుతూ..వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులను అధికారులు బాధ్యతగా చట్టపరిధిలో పరిష్కరించాలని సూచించారు.సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి పోలీసు సేవలను మరింత వేగవంతం గా,పారదర్శకంగా అందించాలని తెలిపారు.స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసు కోవాలని ఆదేశించారు.పోలీస్ అధికారులు, సిబ్బంది గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని,శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవలు అందించాలని, విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంద న్నారు.ఎస్పీవెంట డిఎస్పీ నాగేంద్రచారి, సి ఐ నాగేశ్వరరావు,ఎస్.ఐ లు ఉపేంద్ చారి, మల్లేష్ , సిబ్బంది ఉన్నారు.



# విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**-మోడల్ స్కూల్‌లో బోరుబావి పనులు, కిచెన్ షెడ్ ప్రారంభం**

**-రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**చురకలు, విలేఖరి, వెల్గటూర్, జూలై, 21 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లె తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్య తో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకొన్న రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం పాఠశాలను సందర్శించి మంచినీటి బోర్‌వెల్ తవ్వకానికి భూమిపూజతో పాటు రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన కిచెన్ షెడ్డును ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులు తమ పాఠశాలలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని మంత్రిని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.తదుపరి విద్యార్థుల తో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసు కున్నారు.పాఠశాలలో అందుతున్న భోజనం నాణ్యత, విద్యా బోధనపై ప్రత్యేకంగా ఆరా తీశారు. విద్యార్థులకు భోజనం,చదువు విషయంలో ఎలాంటి లోపాలు,ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పాఠశాల ప్రిన్సిపాల్‌కు మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్,స్థానిక నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## తండాలను గ్రామ పంచాయితీలు చేసిన

# ఘనత కేసీఆర్ దే



**-మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి**

**చురకలు విలేకరి, సారంగాపూర్, జూలై 21 :** తండాలను గ్రామ పంచాయితీలు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ దేనని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి అన్నారు. సారంగపూర్ మండలం లక్ష్మీదేవిపల్లె గ్రామంలోని శీతదేవి ఆలయంలో మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి శీతదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించింది గిరిజన సోదరులులేనన్నారు. రాజ్యాంగం ప్రకారం దళితులకు, గిరిజనులకు వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని ఉండగా, ఉమ్మడి రాష్ట్రంలో 10శాతం గిరిజనులు ఉండగా ఆరు శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు చేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ ఆరు శాతం ఉన్న రిజర్వేషన్లను 10 శాతం చేశారని, కేసిఆర్ నాయకత్వంలో విద్యా, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. గిరిజన తండాలు మెరుగుపడాలని ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేశారని, కేసీఆర్ గిరిజన తండాలను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. గిరిజనులకు పూర్తిస్థాయిలో హక్కులు కల్పించ బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో × తేలు రాజు, సర్పంచ్ ఆకుల రమేష్, రాంచంద్ర రెడ్డి, సర్పంచ్ భుక్య సంతోష్, ఉప సర్పంచ్ చిరంజీవి, తిరుపతి, గంగాధర్, సుధాకర్, మహిపాల్ రెడ్డి, శేఖర్, రాజు, మహేష్, శ్రీధర్, నోముల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.